క్లుప్తంగా

నియామకం



మంగపేట: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియా విభాగం జిల్లా కోఆర్డినేటర్‌గా మండలంలోని రాజుపేటకు చెందిన కర్రి నాగేంద్రబాబును నియమిస్తూ రాష్ట్ర కోఆర్డినేటర్ పట్టి నవీన్‌కుమార్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో జిల్లా కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించిన నవీన్‌కుమార్‌కు నాగేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

కేసు నమోదు

వాజేడు: నల్ల బెల్లం, పటిక తరలిస్తున్న ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పేరూరు ఎస్సై రమేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఏడ్జర్లపల్లి గ్రామానికి చెందిన అంకెన బోయిన బాల కృష్ణ, కొప్పుసూరు గ్రామానికి చెందిన శ్రావణి ద్విచక్రవాహనంపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని తాళ్లగూడెం గ్రామం నుంచి 10 కేజీల పటిక, 50 కేజీల నల్ల బెల్లం తీసుకువస్తున్నారు. మండల పరిధిలోని కడేకల్ గ్రామం వద్ద వారిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి ద్విచక్రవాహనం, పటిక, బెల్లం స్వాధీనం చేసున్నట్లు వెల్లడించారు. వాటి విలువ 29,800 ఉంటుందని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా పోలీస్ స్టేషన్‌కి నూతన ఎస్సైగా అచ్చ కమలాకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. డీసీఆర్‌బీ ములుగు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ప్రజలకు కృతజ్ఞతలు

గోవిందరావుపేట: అసెంబ్లీ ఎన్నికల బదిలీలో భాగంగా పస్రా ఎస్సైగా బాధ్యత తీసుకున్న అనంతరం 8 నెలలు విధులు నిర్వర్తించిన ఎస్సై షేక్ మస్తాన్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై షేక్ మస్తాన్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో, మేడారం జాతర సమయంలో ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసుల తనిఖీ



వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలను నిర్వహించారు. ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సివిల్, టీఎస్ఎస్‌పీ ఫోర్స్‌తో కలిసి 163 నంబర్ జాతీయ రహదారి, వాజేడు, భద్రాచం రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు వాహనంలోని బ్యాగులను సోదాలు చేశారు.

ట్రై సైకిల్ అందజేత



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఎస్సీ మర్రిగూడెం గ్రామానికి చెందిన కోయిల అఖిల్ అనే దివ్యాంగునికి మంగళవారం ట్రై సైకిల్‌ను చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ పాయం రమణ చేతుల మీదుగా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష , చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు రమాదేవి, పుష్పలత తదితరులు ఉన్నారు.

మాక్ పోలింగ్

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. స్కూల్ లీడర్ ఎన్నికల్లో బండారి వినయ్ ఎన్నికయ్యాడు. తరగతి లీడర్లుగా ఆరవ తరగతికి బండారి అన్వేష్, ఏడవ తరగతికి సంజయ్, 8వ తరగతికి ఐశ్వర్య, 9వ తరగతికి నక్షత్ర ఎన్నికయ్యారు. ఎన్నికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సురేందర్, కల్యాణి, అనిల్‌కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీన్, లలిత, విజత, శ్రీకళ, స్పందన, చందర్, సాంబయ్య ఉన్నారు.

చెక్కుల పంపిణీ

మహాముత్తారం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చెక్కులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని 61మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుభద్ర, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీ లక్కిరెడ్డి నర్సింహారెడ్డి, లింగమల్ల దుర్గయ్య పాల్గొన్నారు.

‘బయోమెట్రిక్’ను ఉపసంహరించుకోవాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ములుగు రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ అంగన్‌వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం అమలు చేయాలనే నిర్ణయాన్ని తక్షణమే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నాకు దిగారు. ఒక్కపూట బడితో పాటు మే నెలంతా టీచర్స్, హెల్పర్స్‌కు సెలవులు ఇవ్వాలని, 24 రోజుల సమ్మె హామీలను వెంటనే అమలు చేయాలని, హెల్పర్స్‌ను పాత పద్ధతిలోనే ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఏఓ ప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ మార్చి 2న సీఎం రేవంత్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం దుర్వినియోగం కాకుండా సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని అధికారులను ఆదేశించడం సరికాదన్నారు. అంగన్‌వాడీలను దొంగలుగా ఆరోపించడాన్ని తీవ్రంగా ఖండించినట్లు వెల్లడించారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.సరోజన, సమ్మక్క, పద్మరాణి, ప్రేమ కుమారి, సదాలు, భాగ్యలక్ష్మి, జమున రాణి, రేణుకతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న అదనపు కలెక్టర్



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న మహేందర్‌జీ

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహేందర్‌జీ మంగళవారం దర్శించుకున్నారు. ఇటీవల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గోవిందరాజు, పగిడిద్దరాజులకు కూడా పూజలు చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు డోలు వాయిద్యాలతో పూజారులు గద్దెలపైకి స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనను అమ్మవార్ల కండువాతో పూజారులు సన్మానించి ప్రసాదం అందించారు. ఆయన వెంట తహసీల్దార్ రవీందర్, ఎండోమెంట్ జూనియర్ అసిస్టెంట్ మధు, తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో చీడపీడలపై అవగాహన



రైతు నేస్తంలో పాల్గొన్న అధికారులు

వాజేడు: మామిడి, వరిని ఆశించే చీడపీడలపై మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు సుచరిత, శ్రీనివాస్, గోపిలు పలు సూచనలను చేశారు. మండల పరిధిలోని పేరూరు రైతు వేదికలో మంగళవారం ఏటూరు నాగారం సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీధర్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని రైతులు, డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు రైతు నేస్తం కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మామిడి, వరి పంటలో చీడ పీడల నివారణకు పలు విషయాలను వారు రైతులకు అర్థమయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమానికి మండల వ్యవసాయాధికారులు, విస్తరణాధికారులు హాజరయ్యారు.

నీటిని ఎక్కువగా తీసుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్యుడు ప్రణీత్‌కుమార్

ఏటూరునాగారం: గ్రామీల్లో ఉండే ప్రజలు నీటిని ఎక్కువగా తీసుకోవాలని కన్నాయిగూడెం వైద్యాధికారి ప్రణీత్ కుమార్ అన్నారు. మంగళవారం ఏటూరునాగారం మండలంలోని కొండాయి, మల్యాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులను అందజేసినట్లు వైద్యుడు తెలిపారు. వేసవి కాలం కావడంతో తాగునీటినిఎక్కువ మోతాదులో తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, హెల్త్ అసిస్టెంట భాస్కర్, ఏఎన్ఎం సమ్మక్క, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి



విద్యార్థులతో జెడ్పీటీసీ పాయం రమణ

వెంకటాపురం(కె): పదో తరగతి విద్యార్థులు ప్రశాంతగా ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలని జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



లబ్ధిదారులకు వివరిస్తున్న సూపర్‌వైజర్ వసంత

ఏటూరునాగారం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటేనే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నబోయినపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వసంత హాజరై మాట్లాడారు. మనకు అందుబాటులో దొరికే చిరుధాన్యాలలో మంచి పోషకాలు ఉంటాయని వాటిని తీసుకోవడం వల్ల ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. చిరు ధాన్యాలు తీసుకోవడం వల్ల మహిళలు, గర్భిణులు, బాలింతలు, రక్తహీనతను తగ్గించుకోవచ్చన్నారు. అంగన్‌వాడీ టీచర్లు రమణ, ఇందిరా, అహల్యా, ఆయా సమ్మక్క పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న రవితేజ

ఏటూరునాగారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వరంగల్ నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ రవితేజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో వరంగల్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నాలుగు మండలాల బ్లాక్ లెవల్ క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ.. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, రన్నింగ్ వంటి ఆటలు నిర్వహించడం జరిగిందన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా యువత రాణించాలని తెలిపారు. క్రీడల వల్ల శారీరక ఆరోగ్యం కలుగుతుందని, మానసిక ఒత్తిడి అధిగమించవచ్చని వివరించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటురునాగారం పీఈటీ రవి, హ్యాండ్ బాల్ కోచ్ కుమారస్వామి, యూత్ లీడర్స్ కిశోర్ కుమార్, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనుల బహిష్కరణ



పనులను బహిష్కరించిన కూలీలు

రేగొండ: మండలంలోని రూపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీలు మంగళవారం పనులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్ణీత సమయంలో కూలి అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా పనులు చేస్తున్న సమయానికి డబ్బులు అందడంలేదని కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది చేసిన పనుల డబ్బులు ఇప్పటికీ రాకపోవడంతో పనులు బహిష్కరించినట్లు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏటూరునాగారం: పాఠశాల సమయంలో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి బావిలో పడి చనిపోయిన ఎనిమిదో తరగతి విద్యార్థి పెద్ది కృష్ణప్రసాద్ కుటుంబానికి పరిహారం చెల్లించాలని నాయకపోడ్ సేవ సమితి జిల్లా అధ్యక్షుడు కాపుల సమ్మయ్య, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు సోలం సురేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రాకు నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాడ్వాయి మండలం వనవాసీ కల్యాణ పరిషత్ హాస్టల్లో ఉంటూ జిల్లా పరిషత్ హై స్కూల్ ఇంద్రానగర్ తాడ్వాయిలో 8వ తరగతి చదువుతున్న ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామానికి చెందిన పెద్ది కృష్ణ ప్రసాద్ సోమవారం బావిలో పడి మృతి చెందినట్లు తెలిపారు. స్కూల్ సమయంలో యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే ఒక నిరుపేద విద్యార్థి మృతి చెందడం జరిగిందని ఆరోపించారు. స్కూల్ యాజమాన్యంపై ప్రభుత్వం వెంటనే చర్య తీసుకోని చనిపోయిన కృష్ణప్రసాద్ కుటుంబానికి నష్టపరిహారం రూ.20 లక్షలు, ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాటి నీలాద్రి, తాటి మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



బియ్యం, నగదు అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు పరామర్శించి 50 కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మండల కేంద్రంలోని శివాలయం కమిటీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దబోయిన అర్జున్ కుమారుడు సాయి చరణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా బాధితుడిని పరామర్శించి రూ.2వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు గుడ్ల దేవేందర్, అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, నాయకులు నర్సింహారావు, వావిలాల ఎల్లయ్య, ఎండీ గౌస్ పాషా, సులేమాన్, గద్దల నవీన్, శివాలయం చైర్మన్ ప్రసాద్, డైరెక్టర్లు కిరణ్, రాంలాల్, పోషాలు పాల్గొన్నారు.

కొడవటంచ హుండీ ఆదాయం రూ.11.58లక్షలు

రేగొండ: మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ ఆదాయం రూ.11లక్షల 58వేలు వచ్చినట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పర్యవేక్షణ అధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో హుండీలను లెక్కించారు. నోట్లు రూ.10,99,235, నాణెములు రూ.58,776 వచ్చాయి. 2024 జాతర బహిరంగ వేలంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి వేలం రూ.4,24,000, పూలదండలు, విడిపూలు అమ్ముకునేందుకు రూ.11వేలు హెచ్చుపాటగా దుకాణ యాజమానులు దక్కించుకున్నారని ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, అర్చకులు బుచ్చమాచార్యులు, శ్రీనివాసచార్యులు కమిటీ సభ్యులు శ్రీధర్, ఓంకార్, కోటేశ్వర్‌రావు, జోగేందర్, సుదర్శన్, తిరుపతి, లక్ష్మీ, సంజీవరెడ్డి, తిరుపతి, కళావతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): కాంగ్రెస్ ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కేబినెట్‌లో ఆమోదం తెలపటంపై మున్నూరు కాపు మండల కమిటీ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మున్నూరు కాపు భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు కృషి చేసిన రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెజ్జిని సత్తిబాబు, కూసం సాంబ శివరావు, రంగయ్య నాయుడు, దాసరి నారాయణ రావు, జక్కులు శ్యామ్ తదితరులు ఉన్నారు.

పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పూనెం సాయి

వెంకటాపురం(కె): ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొమురంభీమ్ నగర్‌లో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలు పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అధికారులు కుట్రలు చేస్తున్నారని అన్నారు. బెస్తగూడెం కొమురం భీమ్ కాలనీవాసుల పోడు భూములను లాక్కునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనేతరులు కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనితి వెంకటకృష్ణ, పూనెం ప్రతాప్, తదితరులు ఉన్నారు.

చైర్మన్‌గా రఘోత్తంరెడ్డి

టేకుమట్ల: మండలంలోని రాఘవాపూర్ శివారులో ప్రతీ సంవత్సరం నిర్వహించే శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల జాతర కమిటీ చైర్మన్‌గా బండ రఘోత్తంరెడ్డిని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వివరాలను వెల్లడించారు. ప్రధాన కార్యదర్శిగా మొగిళి రమేష్, వైస్ చైర్మన్‌గా అంబాల కిరణ్‌కుమార్, కోశాధికారిగా పర్లపెల్లి సాంబయ్యతో పాటు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్ బండ రఘోత్తంరెడ్డి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు, ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులను తీసుకొచ్చి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నందికొండ మహిపాల్‌రెడ్డి, మాదం కొమురయ్య, పైడిపెల్లి లచ్చయ్య ఉన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 72 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 18 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న సీఐ రాజేశ్వర్‌రావు

పలిమెల: కొత్త వ్యక్తులు, అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని సీఐ రాజేశ్వర్‌రావు గ్రామస్తులకు సూచించారు. కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం మండలంలోని ముకునూర్ గుత్తికోయగూడెంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతీ ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మావోయిస్టులకు ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. త్వరలో లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికలు సాఫీగా నిర్వహించేలా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పలిమెల ఎస్సై తమాషారెడ్డికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తమాషారెడ్డి, సివిల్, టీఎస్ఎస్‌పీ పార్టీ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం

చిట్యాల: చిట్యాల సర్కిల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన మల్లేష్‌యాదవ్‌ను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మొకిరాల మధువంశీకృష్ణ, జిల్లా కార్యదర్శి చిలుకల రాయకొమురు, ఎంపీటీసీ దబ్బెట అనిల్, మండల నాయకులు చింతనిప్పుల మధు, సర్వ శరత్‌కుమార్, పింగిళి సతీష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపట్టాలి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని రామచంద్రాపురం పంచాయతీలో అక్రమంగా తీర్మానాలు చేసి అవినీతిని ప్రోత్సహించిన పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్, పంచాయతీ ప్రత్యేక అధికారి వీరభద్ర ప్రసాద్‌కు ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇసుక ర్యాంపుల్లో ఇసుక లారీల నుంచి లారీకి రూ.100 చొప్పున వసూలు చేసిన సొ మ్ము రూ.పది లక్షలు అభివృద్ధికి ఖర్చు పెట్టకుండా పంచాయతీ ట్రాక్టర్ నిర్వహణ, సిబ్బంది జీతాలకు ఖర్చు పెట్టామని పంచాయతీ కార్యదర్శి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పంచాయతీ నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల వివరాలు సైతం గ్రామ సభలో తెలియ చేయటం లేదని అన్నారు. ఈ విషయంపై అధికారులు విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.